క్లుప్తంగా

'మెపా' రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



కేసముద్రం: మెపా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కోరుకొండపల్లి గ్రామానికి చెందిన చిరుత వెంకటేశ్వర్లును నియమించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

డోర్నకల్: సీరోలు మండలం చిలుకొయ్యలపాడు గ్రామంలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం కాంగ్రెస్ సీరోలు మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశాడు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు ఊడుగుల వెంకన్న, నాయకులు రాము, లక్ష్మీనారాయణ, బోడ రమేష్, ఉపేంద్ర పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తొర్రూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సిలార్ సాహెబ్ కోరారు. మంగళవారం మండలంలోని అమ్మాపురం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలకు అన్నివసతులు కల్పిస్తామన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం ధ్వజస్తంభం, మహాగణపతి, ఆంజనేయస్వామి, నాగేంద్రస్వామి, ముత్యాలమ్మతల్లి, నవగ్రహ, శివలింగ, కట్టమైసమ్మతల్లి విగ్రహాలను ఊరేగించారు. మహిళలు నీళ్ల బిందెలతో ఊరేగింపు నిర్వహించి విగ్రహాలకు జలాభిషేకం చేశారు.

ఐదు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలి

చిన్నగూడూరు: ప్రతి రైలులో ఐదు జనరల్ బోగీలు ఏర్పాటు చేయాలని సాధారణ బోగీల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు, సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో సాధారణ బోగీల సాధన సమితి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రికి దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్, చంద్రయ్య, కొమ్ము నరేష్, బెడద మధు, కిషన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కేసముద్రం: పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని భుక్యారాంతండాజీపీ శివారు అవుసలితండాలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోత్ బిచ్యా(44)అనే వ్యక్తి కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది, ఈనెల 6న పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కాగా మృతుడి తల్లి మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజ్)లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(బుధవారం) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శారద మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యం

మహబూబాబాద్ అర్బన్: పట్టుదలతో సాధించాలనే తపన ఉంటే విజయం సాధ్యమవుతుందని భగత్‌సింగ్ స్టడీ సర్కిల్ జిల్లా గౌరవ అధ్యక్షుడు సోమ గోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ఇటీవల గురుకులంలో అధ్యాపకురాలిగా ఉద్యోగానికి ఎంపికైన దండెం జ్యోతిని స్టడీ సర్కిల్ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గంగాధర్ శ్రీనివాస్, కోశాధికారి సదానందం, సభ్యులు బావుసింగ్, రవి, వీరన్న, గోపి, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో మంచి ఫలితాలు సాధించాలి



మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ బాలికల పాఠశాలలో పరీక్ష ప్యాడ్లతో విద్యార్థినులు



గార్ల: గోపాలపురం హైస్కూల్‌లో అందజేసిన పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు



డోర్నకల్: కస్తూర్బాలో..



కేసముద్రం: తాళ్లపూసపల్లిలో..



గూడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా యూఎస్ఏ, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ గౌరవ సభ్యుడు రాయపాటి కృపాకర్ సహకారంతో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సొసైటీ అధ్యక్షుడు రామసహాయం మంగళవారం పంపిణీ చేశాడు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణయ్య, కోశాధికారి ఆకుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు గిరిజ, శ్రీవాణి, వసంత పాల్గొన్నారు.

గార్ల: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని ఎస్సై ఎస్.జీనత్‌కుమార్ కోరారు. మంగళవారం మండలంలోని గోపాలపురం హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అదే గ్రామానికి చెందిన ఇమ్మడి గోవింద్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజకుమారి, హెచ్ఎం పద్మ, ఉపాధ్యాయులు రామచంద్రు, శివ, రాజేశ్వరీ, మధు, వీరభద్రం పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక కస్తూర్బా పాఠశాలలో విజయ ఫౌండేషన్ అధ్యక్షుడు మాళోత్ రామారావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ఎస్‌కె మున్నీ, అక్ష, తదితరులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎస్.లింగయ్య పరీక్ష సామగ్రి అందజేశాడు. ముందుగా పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటయ్య, రమేష్, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఒక్కరూ మారినా చాలు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వాంకుడోతు గోపినాథ్ తన సొంత ఖర్చులతో ఉచితంగా పరీక్ష సామగ్రిని అందించారు.

పార్టీ కోసం కష్టపడే వారికే పదవులు



మాట్లాడుతున్న రెడ్యానాయక్

డోర్నకల్: బీఆర్ఎస్ అభివృద్ధి కోసం కృషి చేసే నాయకులు, కార్యకర్తలను ప్రజాప్రతినిధులుగా గెలిపిస్తానని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ మండల, మున్సిపాలిటీ స్థాయి పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఓటమి పాలవగానే పోలీస్‌స్టేషన్‌లో పైరవీలు చేసుకుని బతికే అవకాశవాదులు పార్టీని వీడుతున్నారని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పదవులు ఇస్తామన్నారు. రైతుబంధు కోసం కేసీఆర్ రూ.7,500 కోట్ల నిధులు సిద్ధం చేస్తే కాంగ్రెస్ గెలవగానే ఇద్దరు మంత్రులు ఆ నిధులు కాజేశారని అన్నారు. కవితను ఎంపీగా గెలిపించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, పీఏసీఎస్ చైర్మన్లు బిక్షంరెడ్డి, సీతారామిరెడ్డి, నాయకులు కత్తెరసాల విద్యాసాగర్, మన్యుపాట్ని, తేజావత్ సంధ్యారాణి, మోనికాజైన్, హైమావతి, రాయల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రముఖుల గైర్హాజర్..

డోర్నకల్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, జెడ్పీటీసీ సభ్యురాలు పాడిశెట్టి కమలారామనాథం, కౌన్సిలర్లు సురేందర్‌జైన్, పర్వీన్‌సుల్తానా, హేమచంద్రశేఖర్, బసిక అశోక్ తదితరులు హాజరుకాలేదు. దీంతో పార్టీ మారుతున్నారని ప్రచారం జరుగుతోంది.

సీసీ కెమెరాల ఆలోచన విరమించుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, నాయకులు

మహబూబాబాద్: అంగన్‌వాడీలను అవినీతిపరులుగా చిత్రీకరించేలా అంగన్‌వాడీ కేంద్రాలలో సీసీ కెమెరాలు పెట్టే ఆలోచనను విరమించుకోవాలని, కుటుంబ సర్వే కోసం 5జీ డేటా టెక్నాలజీతో కూడిన ట్యాబ్‌లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ డిమాండ్ చేశాడు. సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయంలో డీడబ్ల్యూఓ వరలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. బయోమెట్రిక్ పెట్టే ఆలోచనను వెంటనే విరమించుకోవాలన్నారు. హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి దార స్నేహబిందు, సరోజ, స్వరూప, తిరుపతమ్మ, జ్యోతి, మానిక, నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, మల్లయ్య, దుర్గారావు, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు సాయం చేయడం సంతోషకరం



ల్యాప్‌టాప్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం: పేదవారికి సహాయం చేయడం అభినందనీయమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో నిర్వహించిన తోపుడుబండ్లు, కుట్టుమిషన్లు, ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పేదలకు చేతన ఫౌండేషన్ నిర్వాహకులు వెనిగళ్ల రవికుమార్ వారి సోదరులు వెంకటేశ్వరరావు, అనిల్‌కుమార్‌లు సాయం చేయటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ప్రజాకవి జయరాజ్, మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, ఎంపీపీ నాగరత్నమ్మ, వైస్ ఎంపీపీ గణేష్, సీనియర్ జర్నలిస్ట్ ప్రసాద్, స్థానికులు వల్లమూడి సురేష్, నవీన్, రషీద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'రాజ్యాంగంపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు'

నెహ్రూసెంటర్: రాజ్యాంగంపై బీజేపీ కర్ణాటక ఎంపీ అనంతకుమార్ హెగ్డే చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని ఎమ్మార్పీఎస్ దండోర రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ్ర ఎల్లయ్య మాదిగ అన్నారు. సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అవమానించడం అంటే సామ్యవాద, లౌకికవాద, ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశాన్ని అవమానించినట్లేనని పేర్కొన్నారు. అన్నివర్గాల అభివృద్ధి, అభ్యున్నతి కోసం అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పాటుపడుతుందన్నారు. అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రాధా, సుధా, సంధ్య, జయ, పద్మ, రమణ, ఉపేందర్, జ్యోతి, అరుణదేవి, సతీష్, భాను, లచ్చయ్య, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

'శంకర్‌నాయక్ పార్టీ మారే ప్రసక్తిలేదు'

కేసముద్రం: మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ పార్టీ మారే ప్రసక్తి లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండి.నజీర్‌అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో నిజంలేదన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న కళాకారుడు అందెశ్రీ

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థుల భవిష్యత్‌కు వందేమాతరం ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రజా కళాకారుడు అందెశ్రీ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని నితిన్‌భవనంలో వందేమాతరం ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో 45 రోజులుగా నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షల అధ్యాయన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై అందెశ్రీ మాట్లాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు రవీందర్‌రావు, ఎంఈఓ బుచ్చయ్య, క్యాంప్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రాయపర్తి ఎంపీపీ అనిమిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న అరుణ

చిన్నగూడూరు: ఆడపిల్లలను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. మండల కేంద్రంలోగల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లితండ్రులు పిల్లలను సమానంగా చూస్తే వారికి సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సౌజన్య, ఎస్సై ఝాన్సీ, హెచ్ఎం రవికుమార్, ఉపాధ్యాయ బృందం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



పెద్దవంగర: బొమ్మకల్లు ప్రాథమిక పాఠశాలలో..



దంతాలపల్లిలో..

పెద్దవంగర: మండలంలోని బొమ్మకల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్ఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రమేష్, ప్రణతి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ ఉపేందర్ పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల మండల ప్రజాపరిషత్ కేంద్ర ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం మధుసూదన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్ 2పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని డోర్నకల్ రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ జె.సురేష్ మంగళవారం తెలిపాడు. మృతుడు వయసు సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతుడి ఒంటిపై నిలువు తెల్లటి గీతలు కలిగిన బ్రౌన్ కలర్ ఫుల్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపాడు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురి గదికి అన్నం సేవా సమితి డైరెక్టర్ అన్నం శ్రీనివాసరావు సహాయంతో తరలించామన్నారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 87126 58600, 94947 90619 నంబర్లకు తెలియజేయాలని పేర్కొన్నారు.

ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

పెద్దవంగర: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దవంగర మండలానికి చెందిన వైస్ ఎంపీపీ బొమ్మెరబోయిన కల్పనతోపాటు ఐదుగురు ఎంపీటీసీలు బానోతు విజయ, ఈరెంటీ అనురాధ, ఎర్ర సబిత, మెట్టు సౌజన్య, బానోతు రవీందర్ నాయక్‌లు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి, హరిప్రసాద్, తిరుపతి రెడ్డి, నరేందర్ రెడ్డి, నెహ్రూనాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలి

గార్ల: డీడీలు కట్టిన గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల యూనిట్లు వెంటనే మంజూరు చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గార్ల మండలం గోపాలపురం గ్రామంలో జరిగిన యాదవ కులస్తుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు వడ్డెపూడి మల్లయ్య, గోవింద్, శ్రీను, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటు హక్కు వినియోగించుకోవాలి

గూడూరు: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్‌డీఓపీ తిరుపతిరావు ఓటర్లకు సూచించారు. గూడూరు మండలం పొనుగోడు, బొద్దుగొండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. కార్యక్రమంలో సీఐ బాబురావు, ఎస్సై నగేష్ పాల్గొన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కురవి: హాల్‌టికెట్ పేరుతో టెన్త్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయవద్దని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజుల పేరుతో హాల్‌టికెట్ ఇవ్వకుండా వేధింపులకు గురిచేయవద్దని తెలిపారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన

దంతాలపల్లి: మండల కేంద్రంలో గల పోలీస్‌స్టేషన్‌ను తొర్రూరు డీఎస్పీ సురేష్, సీఐ సంజీవతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై కరుణాకర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి

బయ్యారం: గుండెపోటుతో యువరైతు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని గంధంపల్లిలో జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నాయిని వెంకట్రావ్ (30) ఈ ఏడాది కౌలుకు తీసుకొని రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాడు. పంట తెగుళ్ల బారినపడి దిగుబడి రాకపోగా అప్పులు పెరగడంతో కొన్ని రోజులుగా మనోవేదనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్

గూడూరు: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండి.ఖాసీం, బొద్దుగొండ మాజీ సర్పంచ్ ముక్కా లక్ష్మణ్‌రావు, కోబల్‌తండా ఎంపీటీసీ కవిత భాస్కర్‌లతోపాటు శోభన్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్లు మంగళవారం మండల అధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ఆదేశాల మేరకు వారిని సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

సన్మానం

మహబూబాబాద్: హైదరాబాద్‌లోని టీఎన్జీఓఎస్ కార్యాలయంలో కేంద్ర సంఘం ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా టీఎన్జీఓఎస్ మానుకోట జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగదీశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మైసరోహిత్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో స్టాల్ ప్రారంభం

కేసముద్రం: కేసముద్రం రైల్వేస్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన తినుబండారాల స్టాల్‌ను మంగళవారం ప్రారంభించారు. ఒక స్టేషన్, ఒక ఉత్పత్తిలో భాగంగా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేశారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

మహబూబాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించారు, కాని సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని లబ్ధిదారుడు ఆర్.వీరభద్రం ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా కేంద్రం శివారులో గల డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ దీపాలు సక్రమంగా లేవన్నాడు. తాగునీటి సమస్యతోపాటు డ్రెయిజీ లేక పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు.

సురేందర్ రెడ్డిని కలిసిన బలరాంనాయక్

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ కలిశారు. మండలంలోని మాధవపురం గ్రామంలో గల సురేందర్‌రెడ్డి నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించే అంశాలపై పరిశీలన చేశారు.

ప్రత్యేక ప్రార్థనలు

మహబూబాబాద్ రూరల్ : జగద్గురు గౌసూల్ ఆజం దస్తగిరి జన్మదినోత్సవాన్ని మానుకోట జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర బజార్‌లో గల ఖాన్ ఏ ఖాద్రియా సూఫీయా జెండా గద్దెల వద్ద మంగళవారం రాత్రి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మగ్రిబ్ నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేసి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో సూఫీ గురువు పీర్ షేక్ అబ్దుల్ రహమాన్ ఖాద్రి, ముక్తార్ ఖాద్రి, ఇమ్మాముద్దీన్ ఖాద్రి, యాకుబ్ ఖాద్రీ, మూస ఖాద్రి, ఇమ్రాన్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ అందజేత

కురవి: సీరోలు, కాంపల్లి గ్రామంలోని జెడ్పీహైస్కూల్‌లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు రిటైర్డ్ ఐఏఎస్ తేజావత్ రాంచంద్రునాయక్ ఆర్థిక సహకారంతో ఆయన ప్రతినిధి తేజావత్ రాంకిషన్ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ రూ.21,840వేల నగదును అందజేశారు. మంగళవారం సీరోలు హైస్కూల్‌లో 16, కాంపల్లి స్కూల్‌లో 58 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బంగారి, అరుణశ్రీ, ఉపాధ్యాయులు వెంకన్న, శంకర్, విష్ణు, కృష్ణ, సునీల్, చైతన్య, బిక్షం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి సన్మానం

కురవి: సీరోలు మండలం కాంపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం పాఠశాల పూర్వ విద్యార్థి, పీహెచ్‌డీ సాధించిన సీహెచ్ నర్సిరెడ్డిని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణశ్రీ, ఉపాధ్యాయులు బొందిలి వెంకన్న, బిక్షం, శంకర్, విష్ణు, కృష్ణ, చైతన్య, బాలరాజ్, గ్రామస్తులు మాట్లాడారు.

అమిత్‌షా సభకు తరలిన నాయకులు

తొర్రూరు: హైదరాబాద్‌లో జరిగిన విజయ సంకల్ప మహాసమ్మేళన సభకు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, నాయకులు పల్లె కుమార్, సురేష్, రవిబాబు, యాకయ్య, రాజేష్, శేఖర్, భరత్, నవీన్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు సముచితస్థానం కల్పించాలి



నెహ్రూసెంటర్: ఆదివాసీలకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ చందా లింగయ్యదొర అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథ భవన్‌లో ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధాన పార్టీలు ఆదివాసీలకే మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రమణాల లక్ష్మయ్య, పొడెం రత్నం, కొడెం వెంకటేశ్వర్లు, ముక్తి రాజు, కోటే రవి, వాసం రామకృష్ణ, బుర్క యాదగిరి, కన్నయ్య పాల్గొన్నారు.